# ఒడిషా

# పాలకపార్టీల ముందుకొచ్చిన పంట రుణాల రద్దు అంశం

**లోక్‌సభకు,** ఒడిషా రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగటానికి ఇక కొద్దినెలల కాలవ్యవధి మాత్రమే వుండగా, పాలక రాజకీయపార్టీలు రైతాంగాన్ని ప్రలోభపరచటానికి మరోసారి పూనుకుంటున్నాయి. అనేక రకాల వ్యవసాయరంగ సమస్యలు రైతులను రుణభారంలోకి, నిరాశా నిస్పృహలోకి ఆపై ఆత్మహత్యలవైపు నెడుతుండగా, రుణాలరద్దు అంశం అందరినీ ఆకర్షిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాధ్ ప్రభుత్వం వ్యవసాయ పంట రుణాలు రద్దుచేసింది మొదలు, ఒడిషాలోనూ రుణాలు రద్దుచేయాలనే అంశం జోరందుకుంది. ఒడిషాలో ప్రస్తుతం బిజెపి, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఈ అంశంపై ప్రధానంగా మాట్లాడుతున్నాయి.

బిజెపి నాయకులు, కేంద్రమంత్రులు అయిన జుయెల్ ఓరమ్, ధర్మేంద్ర ప్రధాన్‌లు, ఒడిషా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్‌లు – రైతాంగ సమస్యలపట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వుందని ఆరోపిస్తూ, రాబోయే ఎన్నికల్లో తాము రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రైతాంగ రుణాలన్నీ సంపూర్ణంగా రద్దుచేస్తామని ఎవరికి వారు గంభీరంగా ప్రకటిస్తున్నారు.

ఈ వత్తిడి ఫలితంగా, రైతాంగ రుణాల రద్దు ప్రతిపాదనను పరిశీలిస్తానని తనను కలిసిన రైతాంగ ప్రతినిధుల బృందంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వాగ్దానం చేశాడు. తనపై వత్తిడిని తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా 2018 జూన్ 18న ఆయన ప్రధాని మోదీకి ఓ లేఖ రాశాడు: "రైతాంగాన్ని ప్రస్తుత దుస్థితి నుండి బయటపడ వేయటానికి పంట రుణాల రద్దుపై మనకొక జాతీయ స్థాయి విధానం వుండితీరాలి. కేంద్రప్రభుత్వం తీసుకునే ఎలాంటి చొరవకైనా రాష్ట్రప్రభుత్వం మద్దతు ఇవ్వటానికి సిద్ధంగా వుంది" అని ఆ లేఖలో ఆయన పేర్కొన్నాడు. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వ కోర్టులోకి బంతిని విసిరే చర్య మినహా ఇది వేరుకాదు. త్వరలోనే రైతుల పంటరుణాల రద్దు డిమాండ్‌ను ముఖ్యమంత్రే చేపట్టవచ్చు.

రాష్ట్రస్థాయి బ్యాంకు అధికారుల కమిటి (ఎస్ఎల్‌బిసి) వివరాల ప్రకారం 2017 మార్చి 31 నాటికి పంట రుణాల మొత్తం 26,600 కోట్ల రూపాయలు. వీటిలో పంట రుణాలు, వాయిదా రుణాలు, వాణిజ్య బ్యాంకులకు ప్రాంతీయ బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలు 16,800 కోట్లు కలగలిసి వున్నాయి. మిగిలిన 9,700 కోట్ల రూ॥ సహకారరంగ బ్యాంకులు అందించిన రుణంగా వుంది.

రుణాల రద్దుయొక్క అనివార్యతను గమనించిన ఎస్ఎల్‌బిసి వివిధ అంచెల విధానం యొక్క ప్రభావాన్ని అంచనావేస్తోంది. ఒక్కో రైతు యొక్క 50,000 రూ॥ పంటరుణాన్ని రద్దుచేసేట్లయితే అది మొత్తంగా 24,600 కోట్ల రూ॥ అవుతుంది. ఒక పంట రుణం మాత్రమే రద్దుచేసేట్లయితే అది 20,100 కోట్ల రూ॥గా వుంది. 20,000 రూ॥ ఆ లోపు రుణాలు రద్దుచేసేట్లయితే ఆ మొత్తం 15,800 కోట్ల రూ॥గా వుంది.

రుణాల రద్దు గురించిన ఈ విధి విధానాలన్నీ బహుశా రాబోయే ప్రభుత్వమే చేపడుతుంది. ఏమైనా, ప్రశ్నేమిటంటే, ఈ విధమైన రుణాల రద్దు రైతాంగ దుస్థితిని తగ్గిస్తుందా అంటే లేదు అనేదే సమాధానం.

కేంద్రప్రభుత్వం 2008లో ఒకసారి రైతు రుణాల రద్దు పథకాన్ని అమలుచేసింది. రాష్ట్రవిభజన అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోనూ, రాజస్థాన్, పంజాబ్, యు.పి., హర్యానా రాష్ట్రాలలో ఎన్నికల వాగ్దానాలలో భాగంగా రైతాంగ రుణాలరద్దు అంశాన్ని చేపట్టారు. ఇటీవలే కర్నాటక, మహారాష్ట్రలు కూడా రైతుల రుణాలరద్దు ప్రకటన చేశాయి. అయినప్పటికీ, రైతాంగ దుస్థితి కొనసాగు తుండటమేగాక, ఆత్మహత్యలు కూడా యధాప్రకారం జరుగుతూనే వున్నాయి.

అయితే వాగ్దానం చేసిన దానికి, అమలు చేస్తున్న దానికి నడుమ చాలా పెద్ద తేడా వుంటోంది. రాష్ట్రప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని సాధ్యమైనంత తగ్గించుకునే దానిలో భాగంగా వాగ్దానం చేసిన నాటికంటే పథకాలను కుదించి వేయటం జరుగుతోంది. ఒకవేళ వ్యవసాయ రుణం మొత్తం రద్దుచేసినప్పటికీ కూడా, రైతాంగ దుస్థితి కొనసాగుతుంది. ఎందుకంటే, ఇవేవీ రైతాంగ సమస్యల మూలకారణాల వద్దకు వెళ్ళటం లేదు.

కేంద్రంలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ పాలన సాగిస్తున్న వరుస ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల ఫలితమే రైతాంగ ఈ దుస్థితి. గత రెండు దశాబ్దాలపైగా కాలంలో రుణభారం మరింత పెరిగిపోవటం ఈ అశాంతికి మూలకారణంగా వుంది. వ్యవసాయరంగానికి, రైతాంగానికి అందజేసే సబ్సిడీలన్నింటినీ అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు పూర్తిగా తొలగించి వేశాయి. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, సాగునీరు, డీజిల్ మొదలైన వ్యవసాయ ఉత్పాదక ఖర్చులన్నీ అనూహ్యంగా పెరిగిపోయాయి. ప్రయోగశాల నుండి పంట పొలానికి వ్యవసాయ సేవలందించటం పూర్తిగా కనుమరుగైంది. ప్రభుత్వ కొనుగోలు సంస్థలన్నింటినీ ఉపసంహరించుకొని, రైతులను ప్రైవేటు దళారుల దయాదాక్షిణ్యాల కొదిలేయటమే జరిగింది. రైతులకు పంట మదుపు అవసరాలు పెరుగుతూండగా, అంకెల్లో పెరిగినట్లు కన్పించినా వారికి సంస్థాగత రుణాలు మాత్రం (రైతాంగ అవసరాలలో కేవలం 17 శాతం) అక్కడే వుండిపోయాయి.

ఈ విధానాలన్నింటినీ సంపూర్ణంగా తిరగదోడకుండా, కేవలం రైతాంగ పంట రుణాలలో కొంత భాగాన్ని రద్దుచేయటం, ఈ దుస్థితి నుండి రైతాంగాన్ని బయటపడవేయటానికిగానీ లేదా వ్యవసాయరంగాన్ని మెరుగుపరచేందుకుగానీ ఏమాత్రం దోహదపడదు.

ooooo